రుమాలు

పూడిపెద్ది వెంకటరమణయ్య
(కవితాసమితి)

౧

కామాక్షి:—ఏమండీ, మిమ్మల్లను ఒకప్రశ్న అడగాలని కొద్దిరోజులాయ తహతహలాడుతున్నాను. కోపపడకుండా సమాధానం చెప్తారూ?

గౌరీపతి:—ఆప్రశ్న నీళ్లువేసినకవరులో వ్రాసి పెట్టేవా? ఇలాతే. ఒకరూపాయి అక్కడపెట్టు. హనుమంతుడి నడిగి చెప్తాను.

కామాక్షి:—అదికాదండీ.

గౌరీపతి:—అదికాకపోతే, ఏదేనా పువ్వుపేరు చెప్పు.

కామాక్షి:—సరే! బాగుంది!

గౌరీపతి:—అయితే ఉండు, కేరళపక్షి నడుగుతాను.

కామాక్షి:—వెటకారం ఏమిటండీ?

గౌరీ:—అంబా పలుకవే! జగదంబా, పలుకవే!

కామాక్షి:—ఔనుమరీ! నాలాటిదానిమాటలు మీకొకలెక్కా?

గౌరీ:—లెక్కలేకేం? అశ్వనీ, భరణీ, కృత్తికాః పాదం మేషం.

కా:—నా తెలివితక్కువగాని మిమ్మల్నడగడం ఏమిటి? ఇంతకీ నాపూర్వజన్మపుణ్యం ఇలాగుంటే మీరుమాత్రం నన్నేల గౌరవిస్తారూ!

గౌరీ:—ఏదీ నీయెడమచేయి చూపూ. దానిలో నిరేఖలు పూర్వజన్మవృత్తాంతం చెప్తాయి.

కా:—చాలులెద్దురూ! బాగుందిగొప్ప. నాకు మీ రేంచెప్పనక్కరలేదు. మిమ్మల్నడిగేదేమిటి ఆభగవంతుణ్ణడగాలి.

గౌరీ:—అడుగూ! నీప్రశ్నకు జవాబు చెప్పడంకంటె ఆభగవంతుడి కింకేంపని ఉందిగనక- నీముద్దు చెల్లించకపోతే వాడిసృష్టి సాగవద్దూ?

కామాక్షి కన్నులు నీళ్ళతో నిండేయి. తారాజువ్వలలా గామె ముఖాన్ని జాలిరేఖలు పరుగిడుతున్నాయి.

గౌరీ:—కానీ! కన్నీటిచుక్క లొకటిరెండు జారుస్తే చాలదు. కన్నీటికాల్వ, కన్నీటివరద కుమ్మరించీ దానితో నేను కొట్టుకొనిపోవాలి. ఎందు కలా చీటికీమాటికీ ఏడుస్తావూ? నీమనస్సులో తెగ లేదో నాకు తెలుసును. నీవే గడుసుదానవనుకొని నన్ను ప్రశ్నలచేత వంచిద్దామనుకొన్నావు. ఈ పాటిదానికే లొంగిపోతే ప్రపంచం నిలబడుతుందా?

కామా:—(కన్నీరొత్తుకొని) ప్రేమవంచనా? నాజీవితమంతా మీతో సాగించవలసిననేను మిమ్మలను వంచిస్తానా? నేను సానిదాన్నాయేమిటి? నేనెందు కలాచేస్తానూ?

గౌరీ:—అదుగో! రంగులు బయల్దేరుతున్నాయే! నీయేడుపేదో నేను ముందుగానే గ్రహించేనుకాదూ! ఇలాటిఈర్ష్యవల్లే ఆడది చెడిపోతుంది. అదికాక నాకేమిటి! నేను మగవాడను! నేనేంచేసినా తప్పులేదు.

కామ:—తప్పన్నానా? నేనలాఅనగలనా? నా కేఈర్ష్యలూ లేవూ! నేనిలా దిక్కుమాలినదానిలా గీగూట్లో రాత్రింబవళ్ళొంటిగా దేవులాడక ఘోష పెడుతున్నాను. దీపంపెట్టిందిమొదలు దీదీమన్నదిగులుతో ఈకొసవాటింట్లో ఒక్కర్తెనూ ఉండలేకుండా ఉన్నాను.

గౌరీ:—కాకికూత విని పగలే మగణ్ణి కాగిలించికొందట నీలాంటిదే. సానికంటె నీవగలే జాస్తీగా ఉన్నాయే!

కామా:—నాకే ఆలాంటివగలు తెలుస్తే, ముంగొంగుబంగారంగా మిమ్మల్ని ముడిచి దాచుకోనూ! మాణిక్యం మాయకెంపంత తళతళలాడగలదా?

గౌరి:—మాటలుమాత్రం సరిగా ఆడు! మాయకెంపూ, మంటికెంపూ అని అనువుగొంగిక్కిందిగదాఅని అందర్నీ ఆడకు.

కామా:—అందరూఏమిటె? మల్లెపూవాసనేనే ఉల్లిపాయ లుంటాయా?

గౌరి:—కోసహ అదేమాటా? నీనోరే నిన్నింతకు తెస్తూంది. నే నోరుస్తూన్నకొలదీ మితిమీరిపోతున్నావు! నీవేమో గడుసుదానవనీ, నీవుచెప్పినట్టూ నేను మసలుకుంటాననీకాబోలు నీయూహ? అలా కలలోనయినా జరుగదుసుమా!

౨

అరటాకులపందిటిలో నిమిడిపోయినచీకటిలో మల్లెపూలు పేలాలలాగు విరిసేయి. మల్లెలతో సరిచూచుకుందికికాబోలు, వెన్నెలరేక లాయూకులసందుల నుండి చొచ్చుకొని మరీప్రసరిస్తూన్నా యాచీకటిలో-వెన్నెలదారాలతో ఆమల్లెలదండ కడదామని తుమ్మెదొకటి వాటికోసమొదళ్ళకు తడవులాడుతూంది. కోసామొదలూలేని యీప్రయత్నంలో తన కలసట లేకుండాఉండడానికి ఎడపదడప కూనురాగాలు తీస్తూంది. పాలజల్లులాగు రేగినపండువెన్నెల చూచి, చుక్కలలాటి ఆమల్లెపూలుచూచీ, బెగడీ చిన్నబోయీ యెక్కడికయినా పోదామని రెక్కలుగట్టుకొన్న చీకటిలా గుంది ఆతుమ్మెద. దానిఝుంకారం శ్రుతిగా, అరటియాకులచీలికలకొనలో గాలిగళం సవరిస్తూంది. ఇదంతా చూచి చేరెడువిరిసిన అరటిపూరేకుమొగాన్న ఆనందబాష్పాలు జారుతున్నాయి.

ఆపెరట్లో దూరంగా గచ్చుటరుగుమీద కూర్చుని నిట్టూరుస్తూన్నకామాక్షి ఇవన్నీ అలా రెప్పవేయకుండా చూస్తూంది. అందుబాటులో కొమ్మలేకుండానే మూతవడ్డకన్నులతో ముందుకు కొనలుచాస్తూన్న తీగను చూచి జాలిపడ్డాది. అతిథి లేకుండానే వింజామరలు వీస్తూన్న అరటికంబాలను చూచి ఆశ్చర్యపడ్డాది. ఉంచి లే దనకుండా పరిమళాలను ఒలకపోసేస్తూన్న ప్రసవాలను చూచి తలపంకించింది. జగత్తులో ప్రేమ ఎన్నివిధాల వ్యక్తం అవుతూంది! ఈలాటిఅకల్మష ప్రేమ ఏజీవిహృదయంలో పుట్టింది ఆజీవిహృదయంలోనే నిలిచిపోదూ? పంజరంలో చిలుకలాగు పైకిపోవడానికెందు కిలాప్రయత్నిస్తుందీ! అందులోనూ ఆడుదాని వలపు పుట్టినచోట క్షణమైనా నిలువదు. పాత్రాన్వేషణానికి పరగడలు త్రొక్కుతుంది. ఒకటిరెండులక్షణాల కోసం ఉరిపోసుకుంటుంది. ఔచిత్యమెరుగకుండా ఆశలు పుట్టిస్తుంది. ఆవెఱ్ఱిప్రేమ ఇన్నిలలితవస్తుజాలాలతో కలకలలాడుతూన్న యీజగత్తంతటా, పువ్వుసౌరభంలాగు ప్రతిఫలాపేక్ష లేకుండా వ్యాపించ రాదూ! వెన్నెలరేఖలాగు భేదమెరుగకుండా ప్రసరించరాదూ! ఉఁహు-ప్రసరించదు.

కామాక్షి యిలా కొంతసేపు వితర్కించుకొంది. పెరటిలో నున్న ఆచిన్నిఅరటితోటను అతిప్రేమతో పరీక్షించింది. నవయౌవనమున నవనవలాడుతూన్న తన శరీరసౌష్ఠవాన్ని ఆవెన్నెలతెరలోనుండిపరీక్షించుకొంది. వేశ్యాలోలుడయి విర్రవీగుతూన్న గౌరీపతిని తలచి కంపించింది. తనప్రేమకు తగినచోటు కాదని తలచింది. ఆమెప్రేమ క్షణమాత్రము గూడులేనిపక్షివలె బయల తపతపా రెక్కలు కొట్టుకొంది. దానికి కాలుమోపడానికి కానీ అంతజాగా కావాలంది. తలదాచుకుందికి దమ్మిడీఅంతచోటు చాలునంది. ఈయనంత విశాలప్రపంచంలో చోటు లేకపోవడం ఏమిటని పరిహాసంగా నవ్వింది. కన్నులయెదుటగల ప్రతివస్తువుకూ పరీక్షించడం మొదలుపెట్టింది. ప్రతి వస్తువునందునూ తాను మొదటినుండియూ ప్రేమించుచున్న ఒకటిరెండులక్షణాలూ కొరవడుతున్నాయి. ఎక్కువసుందరమయినవి ఉన్నాయి; తక్కువ సుందరమయినవీ ఉన్నాయి. కాని దానితో సమానసౌందర్యం గలవి కనబడలేదు. ఎలాగు కనబడుతుందీ? భర్తను సర్వోత్కృష్టుడయినవానిగ సంప్రదాయసిద్ధంగా చూచుకొనుట కలవాటుపడిన హైందవస్త్రీరత్నమునకు

ఇంకేవస్తువు లలితతరంగా కనబడుతుంది? కామాక్షి విసుక్కుంది; వేడినిట్టూర్పు విడిచింది. వెన్నెల చిచ్చులో వేగిపోతూ అలానిలబడగలదా? దానిని తనయౌవనపాటవం మరింత ప్రజ్వరిల్ల చేస్తూంది, ఆమె వేడియూర్పులే దానినిమరింతరగుల్కొల్పుతున్నాయి. "ఏమిచేయుదును? శరీరపరిత్యాగం చేయుదునా?" అనుతలపు కామాక్షికి పొడమింది. "తప్పు" అని తల యూచింది. ఈప్రశాంతసమయంలో, ఈరేయిని ఎట్లయినా నాప్రేమ కౌకకులాయం నిర్మించా లనుకొంది. ఈలోకమంతా, ఈసృష్టినిర్మాణ సౌందర్యమంతా, ఈజగత్తునిండిన లలితగుణజాలమంతా ఇమిడిన ఒకభరిణ దొరకితే నాప్రేమ ననాయాసముగా నం దిమిడ్చేసి హాయిగ నిద్రింతును గదా! ఆదమరచి అనుభవింతును గదా! ఆమెకు తలపులమీద తలపులు తరంగాలయి వస్తున్నాయి. ఆమె అట్టే అలా బయలుచూస్తూ నిమీలితనేత్రయయి నిలబడిపోయింది. ఆమెహృదయం దిక్తటులంటా విరిసింది. ఆమెకన్నులలో నొకవింత తేజస్సు తళుక్కుమని మెరిసింది! క్రమముగా కన్నులానందబాష్పపూరితా లయినాయి. "ఆఁఁ ఆఁ!! దొరికింది! దొరికింది!" అని త్రుళ్ళిపడి గంతులువేసింది.

3

కోడికూతజామయింది. చందమామ పడమటింటివైపు చల్లచల్లగ మరలిపోతున్నాడు. సిగ్గుపడుతూన్నట్టు చిన్నబోతున్నాడు. తప్పుచేసినట్టు తెల్లబోతున్నాడు. గౌరీపతి గణికాగృహం విడిచి తనయింటికి బయల్దేరేడు. వల్లెవాటు ముసుగుపెట్టుకొని వడివడిగా నడుస్తున్నాడు. అడుగులు తడబడుతున్నాయి. అలాగే విధిలేదన్నట్టిల్లుచేరేడు. అప్పటికే కామాక్షి నిద్రలేచి ఇంటిప్రాచిపనులుచేసికొనేది. ఆనాడామె యింకా లేచినసందడి లేదు. గౌరీపతి వీథికిటికీవద్ద నిలచేడు. కొంచెం.తెరచియున్న దానితలుపులసందునుండి లోపలకు చూచేడు. వానిముఖమున పొడిచినట్టు లోనుండి గాలి తరగ కొట్టింది. అత్తరువాసన! అగరువత్తులవాసన! మంచిగంధంవాసన! మల్లెపూలవాసన! పగిలినపాదరసపుబుడ్డీలాగు గౌరీపతిమనసు చెదిరింది. పరిపరివిధాల పరుగెత్తింది. దడదడలాడే హృదయంతో ద్వారం దగ్గరకు వెళ్లేడు. చప్పుడుకానీకుండా తలుపుమీద చేయి వేసేడు. తలుపు విడిపోయింది. వానికి గుండె విడిపోయింది. గుప్పుగుప్పున రేగివచ్చు ఆపరీమళతరంగాలలో వాని యూపిరాడలేదు. చైతన్యంలేని జంత్రపుబొమ్మలాగు ఆలోచనలేని హృదయంతో ఇంట్లో మెల్లగ ప్రవేశించేడు. ప్రక్కచావడీలోకి వెళ్లేడు. ఆ యెదుటిదృశ్యం వానికి కలవలె తోచింది. త్రుళ్ళిపడి కన్నులు విశాలంగా విప్పి ఆసావిడీ కలయచూచేడు. ఎన్నాళ్ళనుండో ఎత్తికట్టిన తూగుటుయ్యాల వ్రేలాడుతూంది. దానిలో పరపూ, తెల్లనిదుప్పటీ, దిండ్లు, మల్లెలకూర్పు. ఆదిండ్లనానుకొని ఒకయోరకొత్తిగిలి కామాక్షి నిదురిస్తూంది! ఆమెపెదవులపయిని చిఱునవ్వు నటిస్తూంది. చెక్కులసిందూరరేఖలు గంధపుపూతతో కళవళపడుతున్నాయి. నొసట చెమటబొట్లు చిగిరించేయి. కమ్మని యూర్పులలో కప్పురపువిడెపువాసనలు గడలుకొంటున్నాయి. అలసియుండుటచేత నామెకు గాఢమయిన నిద్ర పట్టేసింది. ప్రక్కనున్న బల్లమీద పళ్లెరంతో ఫలాహారమూ, పంచపాత్రతో పాలూ.

"ఓసీ! పయోముఖవిషకుంభమా! ఎంతదానవే! నీమెత్తనిమాటలతో, నీఅమాయికపువేషాలతో నీకల్లబొల్లియేడ్పులతో నాకన్నులలో దుమ్ముకొడుతున్నావా? ఇంతకాలం నిన్ను నే నెలా నమ్మేనో నాకే ఆశ్చర్యంగా ఉంది. నమ్మేనూ? అనుమానంతో కొట్లాడుతూనే ఉన్నాను. ఇలాటిసమయంకోసమే వేచికొనిఉన్నాను. ఇక ననుభవిద్దువుగాని ఉండు. ఈ చమత్కారాలన్నీ, ఈసరసాలన్నీ యమలోకంలో స్వేచ్ఛగా అనుభవిద్దువుగాని ఉండు." అని గౌరీపతి రోషంతో నిప్పులుకక్కేడు. కన్నులు భయంకరంగా విప్పేడు. "కుత్తుక పొడిచితీరుతా"నంటూ లోపలినుండి ఒకగునపాం తెచ్చి ఆమెమెడపైకి గురి ఆని నిదురిస్తూన్న కామాక్షిమీది కించుక వంగేడు. ఆమెప్రక్కలలో చినాలీరంగు చిన్నబుటాలరుమాలు వానికి కనబడింది. "అబ్బా! ఇది నాతొలిప్రేయసి సుందరి నాకిచ్చిన

రుమాలు! పాపమామె తనయవసానకాలాన తనకు మారుగ చూచుకోమని ఈరుమాలు నాకిచ్చింది. నాటినుండీ దీనికి వెలుగైనా చూపకుండా దాస్తే యీపాడుముండ దీన్ని తనసరసుడు చేతిలో పెట్టిందికాబోలు. ఈతుచ్ఛురాలిరక్తంతో యీ రుమాలు తడుస్తే అది అపవిత్రమయిపోతుంది.” అంటూ మెల్లగ ఆరుమాలు తీసేడు. నివ్వెరపడ్డాడు. నిలచిపోయాడు. చిఱునవ్వుమొగంతో, చిన్ని అలకలతో, చెదరిన నెమిలిపించెంతో చెంగావి చెక్కులతో, పూలహారాలతో, పుత్తడివన్నెపంచకట్టుతో, మురిడీగొలుసులచేతులతో, ముద్దుముద్దుమాపులతో బాలకృష్ణునివిగ్రహం ఆమెప్రక్కలో ఉంది. గౌరీపతి ఆవిగ్రహాన్ని పరికించి చూచేడు: ఒడలినిండా గంధపుపూతా, మెడలో పూలదండా, కస్తూరీతిలకం ఘుమఘుమ వాసన లూరుతున్నాయి. ప్రక్కను బల్లదగ్గర చిన్నసింహాసనం. దానిలో పూలకుర్చు. వెలిగివెలిగి రొయ్యగరాలిన ఊదువత్తులు గల గళాసులు. ఆచుట్టుప్రక్కల చిలికిన అత్తరుపన్నీరువాసనలు. కొంచెమే చెదరినఫలాహారమూ - ఇవన్నీ చూచేడు. “ఇదా?” అన్నాడు. ఇదిగాక మరేదేనా అయితే ఇంతఆదమరచి నిద్రించగలదా? ఇంతసాహసం చెయ్యగలదా? వట్టిమాట! నయం, తొందరపడి పొడిచీశానుకాను! అన్యాయంగా స్త్రీహత్యాపాతకం చుట్టుకొనిఉండును. లోకంలో నాపేరు శాశ్వతంగా సామెతగా వాడుకొందురే? ఎంతపని జరుగును! ఈరుమాలే నాకంటపడకపోతే నేనీ ఘోరకార్యం చేసేయుందును. ఈరుమాలు భగవదర్పితం కావడంచేత నన్నీరోజున పాతకంనుండి తప్పించింది. ఆహా! ఆచిన్నికృష్ణునివిగ్రహ మెంతలలితంగా నవ్వుతూందో! ఈవిగ్రహమే నిజంగా సజీవమైయుంటే పిపీలికాదిబ్రహ్మపర్యంతం దానిని వలచితీరాలి. ఆనాడీగోపాలకృష్ణుని మనసార నాలింగనముచేసిన యాబ్రేతలు, నందాదియాదవులును ఎంత అదృష్టవంతులు! నా ఆచిన్నికృష్ణుని చూచి యున్నయెడల ఈచింకిబొంకి చిరిపిమొరిపివేశ్యల నెవడు చూస్తాడు! ఈ సౌందర్యముముందర ఆసౌందర్య మెందుకూ! ఈ విగ్రహముప్రక్కను కామాక్షి యెంత కలకలలాడుతూందో. క్రొత్తతళుకుతో కొసరికొసరి ప్రేమచిలికేస్తూంది. ఈవిగ్రహముతో నింతసేపు నిదురించినఈమె ధన్యురాలు. రాత్రియంతయూ నీవిగ్రహమును పూజించిన ఈమెచేతు లెంత అందముగానున్నవో! ఆ పెదవులమీద భక్తి తేజస్సెలా ప్రసరిస్తూందో!” అనుకొని కనులు తడిసేటట్టు కళవళపడ్డాడు గౌరీపతి. చేతిలో గునపాం అటతల పారేసి “హా! కృష్ణా! జగన్మోహనా!” అంటూ తిరిగీ ఆవిగ్రహంవైపు చూచేడు. ఈసుఖం నేనేల అనుభవింపకూడదని యాతడు మెల్లగ వంగి ఆకృష్ణవిగ్రహమున కవ్వలివైపొత్తిగిలి కామాక్షి ముఖమునకు ముఖమయి పడుకున్నాడు. వేడియూర్పులువిడిచేడు.

కామాక్షి మెల్లగ మెలకువగొని కన్నులరవిచ్చింది. ఉదయరాగంతో ఉవ్విళ్లూరుస్తూన్న భర్తముఖం చూచింది కన్ను లాశ్చర్యంతో విశాలంగా విప్పింది. తాను కొలువ నెన్నికొన్న చిన్నికృష్ణుడే భర్తరూపమున పవళించే డనుకొంది.